క్లుప్తంగా

16న వేల్పులమ్మ తీర్థ మహోత్సవం



చంద్రేడులో వేల్పులమ్మ

రంగంపేట: చంద్రేడు ప్రధాన రహదారిలో వేంచేసియున్న గ్రామ దేవత వేల్పులమ్మ వారి వార్షిక తీర్థ మహోత్సవాన్ని 16న ఘనంగా నిర్వహించడానికి గ్రామస్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. బుధవారం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. బుధవారం సాయంత్రం దేవతల స్వరూపమైన గరగలతో నిర్వహించిన గ్రామోత్సవం ఆకట్టుకుంది. గరగలకు పసుపు, కుంకుమలను భక్తులు సమర్పించారు.

ఫుడ్ కమిషన్ చైర్మన్ ఆకస్మిక తనిఖీ



సివిల్ సప్లయిస్ గిడ్డంగిని తనిఖీ చేస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి

మధురపూడి: ఫుడ్ కమిషన్ చైర్మన్ చింతా విజయ ప్రతాప్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. కోరుకొండ మండలం మునగాల రోడ్డులోని సివిల్ సప్లయిస్ గిడ్డంగిని పరిశీలించారు. అక్కడి సరుకుల వివరాలు, నాణ్యతను తెలుసుకున్నారు. రేషన్ డీలర్స్ అసోసియేషన్ రాజమహేంద్రవరం డివిజన్ అధ్యక్షుడు ఇండిగమెల్లి సత్యనారాయణతో మాట్లాడారు. రేషన్ డీలర్లకు తూకం ద్వారానే సరకులు ఇవ్వాలని ఆదేశించారు. గిడ్డంగి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. డీఎస్ఓ ప్రసాదరావు, ఏఎస్ఓ భాస్కర్, ఎంఎస్ఓ లంక సునీత, ఎంఈఓ కుశలవదొర పాల్గొన్నారు.

జక్కంపూడి విజయలక్ష్మి పరామర్శ



గాదరాడలో బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: కోరుకొండ మండలం గాదరాడ, నిడిగట్ల గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలను బుధవారం వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పరామర్శించారు. గాదరాడలోని వైఎస్సార్ సీపీ నాయకుడు హరిబోలు చిన్నమ్మ సూర్యావతి ఇటీవల మరణించారు. ఆ కుటుంబానికి సానుభూతి తెలిపారు. నిడిగట్లలో మృతుడి కుటుంబాన్ని ఓదార్చారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ నాయకులు హరిబోలు చినబాబు, వివ, గొల్లవిల్లి అప్పల నర్సయ్య ఉన్నారు.

పేకాట శిబిరంపై దాడి

బిక్కవోలు: పేకాట శిబిరంపై దాడిచేసి నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బిక్కవోలు శివారులో పేకాట శిబిరంపై దాడిచేసి నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.1,210 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

లారీ డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

కంబాలచెరువు: బాలిక మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ మూడో ఏజేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి ఎస్.వరలక్ష్మి బుధవారం తీర్పుచెప్పారు. వివరాల్లోకి వెళితే.. గోకవరం హైస్కూల్లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కొంతమూరుకు చెందిన భూముల వాడవల్లి 2018 అక్టోబర్ 26న తన మోటారుసైకిల్‌పై కుమార్తె (4)ను ఎక్కించుకుని లాలాచెరువు వెళుతోంది. క్వారీ సెంటర్‌కు వచ్చేసరికి ఆమెను లారీ వెనుకనుంచి ఢీకొట్టింది. నాలుగేళ్ల పాప లారీ కిందపడి మృతి చెందింది. దీంతో బాధితురాలు వాడవల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు ఆధారాలను కోర్టుకు సమర్పించారు. నిజనిర్ధారణ కావడంతో లారీ డ్రైవర్ కొర్రాయి గణపతికి రెండేళ్ల జైలు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కేసును ప్రస్తుత మూడో పట్టణ సీఐ మధుబాబు పర్యవేక్షించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.లక్ష్మీదేవి కేసు వాదించారు.

పోలేరమ్మ జాతర

రాజమహేంద్రవరం: మోరంపూడి గ్రామదేవత పోలేరమ్మ జాతర మహోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. గరగ నృత్యాలు, కోయనాట్యం, కోబ్రా డ్యాన్స్, తీన్‌మార్, విచిత్ర వేషధారణలతో అమ్మవారిని ఊరేగించారు. ఆలయం నుంచి మోరంపూడి, గణేష్ నగర్ వీధుల మీదుగా జరిగిన ఈ ఊరేగింపు ఆకట్టుకుంది. హుకుంపేట, పిడింగొయ్యి, శాటిలైట్ సిటీ, మోరంపూడి, అరవింద నగర్, గాదాలమ్మ నగర్, బుచ్చియ్య నగర్, కవలగొయ్యి ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు రాయి లక్ష్మణరావు, బాలిన వేణు, లింగం వెంకటేశ్వరరావు, యేమిరెడ్డి సత్యనారాయణ, లింగం చంద్రరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోటీకి వెళితే.. పతకాలు వెంటే..

- రోప్ స్కిప్పింగ్ క్రీడలో ప్రతిభ
- దోసకాయలపల్లి, కణుపూరు విద్యార్థినుల ఘనత



రోప్ స్కిప్పింగ్‌లో బంగారు పతకాలు సాధించిన దోసకాయలపల్లి, కణుపూరు విద్యార్థినులు

మధురపూడి: కోరుకొండ మండలం దోసకాయలపల్లి, కణుపూరు హైస్కూళ్లకు చెందిన విద్యార్థినులు రోప్ స్కిప్పింగ్‌లో ప్రతిభ చూపుతున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయిలోనూ రాణించి పతకాలను సొంతం చేసుకుంటున్నారు. ఈ స్కూళ్ల విద్యార్థినులు 2019 నుంచి ఇప్పటి వరకూ ఐదు సంవత్సరాలుగా బహుమతులు అందుకుంటున్నారు. ఇక్కడి 40 మంది ఈ క్రీడలో రాణిస్తున్నారు. రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గంటా విక్టర్ బాబు, ఫిజికల్ డైరెక్టర్లు చెల్లాయమ్మ, శివ ఈ విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు. దోసకాయలపల్లి హైస్కూల్ 30 పతకాలను సాధించింది. ఈ ఏడాది జనవరిలో భీమవరంలో నిర్వహించిన రోప్ స్కిప్పింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో ఆరు బంగారు పతకాలు గెలుచుకున్నారు. తర్వాత జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. అలాగే గతంలో ఆడిన క్రీడాకారిణులు సైతం బంగారు పతకాలను దక్కించుకున్నారు.

ఆకట్టుకునే ప్రదర్శనలు

రోప్ స్కిప్పింగ్‌లో విన్యాసాలు కష్టంగా ఉంటాయి. ఈ జట్టులో ఆరుగురు సభ్యులుంటారు. తాడుతో గెంతుతూ వివిధ విన్యాసాలను ప్రదర్శిస్తారు. తక్కువ సమయంలో ఎక్కువ విన్యాసాలను ప్రదర్శించడం ప్రత్యేకతగా ఉంటుంది. ఈ ఆటలో ప్రతిఒక్కరూ రాణించాలి. జట్టులో ఎవరు తప్పు చేసినా కౌంట్ తగ్గిపోయి బహుమతికి దూరం కావాల్సి ఉంటుంది. అయితే దోసకాయలపల్లి, కణుపూరు విద్యార్థినులు ఈ ఆటలో ఎంతో ప్రతిభ చూపుతూ పతకాలు సాధిస్తున్నారు.

వివిధ రకాల విన్యాసాలు

రోప్ స్కిప్పింగ్‌లో వివిధ రకాల విన్యాసాలున్నాయి. అత్యంత శిక్షణ పొందిన వారికి మాత్రమే బహుమతులు దక్కుతాయి. ఎంతో శారీరక శ్రమ చేయాలి. ఈ క్రీడలో వివిధ రకాలున్నాయి. అవి డబల్ అండర్, డబల్ టచ్ స్పీడ్, డబుల్ టచ్ ఫ్రీస్టైల్, రిలే, సింగిల్ ఫ్రీస్టైల్, టీమ్ ఫ్రీస్టైల్, టీమ్ డెమో తదితర విన్యాసాలున్నాయి. వీటిలో డబుల్ టచ్ స్పీడ్, డబుల్ టచ్ ఫ్రీస్టైల్ అతి కష్టంగా ఉంటాయి.



రాష్ట్ర స్థాయి పోటీలో బహుమతి అందుకుంటున్న వీరమణి



గతేడాది ఢిల్లీలో జరిగిన జాతీయ పోటీల్లో రెండోస్థానంలో నిలిచిన గంటా ఊర్మిక

మానసిక వికాసం



రోప్ స్కిప్పింగ్ ద్వారా మానసిక వికాసం కలుగుతుంది. శారీరకంగా దృఢంగా తయారు కావడంతో సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ సేపు ఆడుకోవచ్చు. వయసుతో నిమిత్తం లేకుండా ఎవరైనా ఆడవచ్చు.

– చెల్లాయమ్మ, ఫిజికల్ డైరెక్టర్, దోసకాయలపల్లి హైస్కూల్

ఇష్టంగా ఆడితే గెలుపు సొంతం



ఎంతో కష్టమైన రోప్ స్కిప్పింగ్ ఆటను ఇష్టంగా ఆడితే గెలుపు సొంతమవుతుంది. విద్యార్థినులకు మరింత ఉపయోగంగా ఉంటుంది. ఫిట్‌నెస్, శక్తి, వ్యాధినిరోధకశక్తిని పెంపొందించుకోవచ్చు. గుండె, మధుమేహ బాధితులకు ఎంతో ప్రయోజనం.

– బి.శివ, ఫిజికల్ డైరెక్టర్, కణుపూరు హైస్కూల్

మెరుగైన శిక్షణ



రోప్ స్కిప్పింగ్‌లో మెరుగైన శిక్షణతో పతకాలను సొంత చేసుకోవచ్చు. మాకు ఫిజికల్ డైరెక్టర్లు ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ ఇచ్చారు. సెలవు రోజులనే ప్రసక్తి లేకుండా నిరంతరంగా వ్యాయామం చేశాం. టీమ్‌లోని సభ్యులందరూ శిక్షణలో రాణించడం ద్వారా బంగారు పతకాలు సాధించాం.

– ప్రసన్న, క్రీడాకారిణి, 9వ తరగతి, దోసకాయలపల్లి హైస్కూల్

జోరుగా జీడిపిక్కల విక్రయాలు



విక్రయాలకు ఉంచిన పచ్చి జీడిపిక్కలు

రంగంపేట: వంటల్లో రుచికి వాడే పదార్థాల్లోనే ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉంటాయి. జీడిపప్పు కూడా అదే కోవలోకి వస్తుంది. ఎండి జీడిపప్పు మనకు సీజన్‌తో సంబంధం లేకుండా ప్రతి దుకాణంలో దొరుకుతుంది. అయితే పచ్చి జీడిపప్పు మాత్రం ఈ సీజన్‌లోనే లభ్యమవుతోంది. ఎండి జీడిపప్పు కంటే ఎంతో రుచి ఉంటే పచ్చి జీడిపిక్కలను ఏడీబీ రోడ్డు పక్కన వ్యాపారులు విక్రయిస్తున్నారు. మండలంలోని కోటపాడు, వెంకటాపురం, జొ.దొంతమూరు, వీరంపాలెం, ఈలకొలను, సింగంపల్లి, నల్లమిల్లి తదితర గ్రామాల్లో జీడిమామిడి తోటలు ఉన్నాయి. ఈ తోటల్లోని పచ్చి జీడిపిక్కలను రైతులు, వ్యాపారులు ఏడీబీ రోడ్డు పక్కన విక్రయిస్తున్నారు. పచ్చి జీడిపప్పు కూర ఎంతో రుచికరంగా ఉండడంతో వీటికి డిమాండ్ పెరిగింది. కిలో జీడిపిక్కలు రూ.150కు విక్రయిస్తున్నారు. దీనిద్వారా మండలంలో పలువురికి ఉపాధి లభిస్తుంది.

ఎండలతో జాగ్రత్తగా ఉండాలి

రాజానగరం: వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడగాల్పుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకుంటూ, అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పవన్ కుమార్ అన్నారు. విపత్తుల నిర్వహణ సంస్థ చేసిన హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్రంలోని పలు మండలాలలో ఇప్పటికే పగటి పూట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతున్నాయన్నారు. రాజానగరం మండల ప్రజలు తమ బయట పనులను ఉదయం 11 గంటలలోపు, సాయంత్రం 4 గంటల తరువాత చూసుకోవడం మంచిదన్నారు.

జగనన్నే మనందరి భవిష్యత్తు



పందలపాకలో పథకాల బ్రోచర్ అందిస్తున్న సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి



ఈలకొలనులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సర్పంచ్, తదితరులు



మిర్తిపాడులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

బిక్కవోలు: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి జగనన్నే మనందరి భవిష్యత్తుగా నిలిచారని సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం పందలపాక సచివాలయం-2 పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. పేదల జీవితాల్లో పథకాలతో వెలుగు నింపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి దీవించాలని ఆయన ప్రజలను కోరారు. ఇంటి యజమాని అనుమతితో గోడలపై మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించారు. సొసైటీ డైరెక్టర్ పడాల వీర్రాఘవరెడ్డి, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గండి వాసు, కొంకుదురు పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ యాసలపు శ్రీనువాస్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కిలపర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: వెంకటాపురంలో సర్పంచ్ ముంగి గంగరాజు, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ మాగాపు వెంకటరమణ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వాల మధ్య తేడా గమనించాలని కోరారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మిర్తిపాడులో..

సీతానగరం: మండలంలోని మిర్తిపాడులో ఎంపీటీసీ మాకిరెడ్డి దేవి, గృహసారథులు జొన్నలగడ్డ సత్యనారాయణ, ఏక రాజు ఆధ్వర్యంలో బుధవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను, నాలుగేళ్లుగా వైఎస్సార్ సీపీ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. బుక్‌లెట్‌లో ఉన్న ప్రశ్నలకు ప్రజల నుంచి జవాబులు రాబట్టి, మిస్డ్ కాల్ చేశారు. అనంతరం ఇంటి వద్ద, సెల్‌ఫోన్‌లకు మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

కోరుకొండ మండలంలో..



కోరుకొండలో..

మధురపూడి: కోరుకొండ మండలంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా జరుగుతోంది. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడుతున్నారు. గాదరాడ, కోరుకొండ, బూరుగుపూడి, మధురపూడి, నర్సాపురం తదితర గ్రామాల్లో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. జగన్ పాలపై ప్రజలందరూ హర్షం వ్యక్తం చేశారు. ప్రతి ఇంటి వద్ద యజమానులే స్టిక్కర్లను అతికించుకున్నారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు



కొత్తతుంగపాడులో వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- కొత్తతుంగపాడులో గడప గడపకూ మన ప్రభుత్వం

రాజానగరం: సీఎం జగన్ రూపొందించిన నవరత్నాలు పథకాలు రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించి, పేదల జీవితాలలో వెలుగులు పంచుతున్నాయని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని కొత్త తుంగపాడులో బుధవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఇంటింటికీ వెళ్లి, ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గడిచిన నాలుగు సంవత్సరాలలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన ప్రయోజనాలను కరపత్రాల ద్వారా వివరించారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని అనేక హామీలను అమలు చేసిన ప్రభుత్వం తమదని సగర్వంగా చెప్పగలుగుతున్నామన్నారు. సుస్థిర పాలన అందిస్తున్న తమ ప్రభుత్వానికి మరో అవకాశం ఇచ్చి, పేదరిక నిర్మూలనతో పాటు రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటి అందించడానికి రూ. 48 లక్షలతో నిర్మించిన ఓహెచ్‌ఆర్‌ని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోలపాటి వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, కో న్వీనర్ గండి నానిబాబు, స్థానిక నాయకులు ఉల్లంగి సూర్యనారాయణ, రౌతు లక్ష్మీపతి, రైతుల శ్రీను, యాళ్ల గణపతి పాల్గొన్నారు.



జల్‌జీవన్ మిషన్‌లో నిర్మించిన ఓహెచ్‌ఆర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సత్రం భూములకు బహిరంగ వేలం నిర్వహించాలి



రంపయర్రంపాలెంలో నిరసన ర్యాలీ చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

గోకవరం: రంపయర్రంపాలెంలోని సుందరమ్మ సత్రానికి చెందిన 89 ఎకరాల భూములకు బహిరంగ వేలం నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సంఘం నాయకులు, సభ్యులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ఈ భూములకు వేలం పాటలు నిర్వహించకుండా దేవదాయశాఖ అధికారులు భూస్వాములకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై పలుమార్లు జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు వినతి పత్రాలు అందించామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ భూములకు వేలం పాటలు నిర్వహించాలని, ఈ భూముల్లో పండిన రూ. లక్షలు విలువ చేసే జీడిపిక్కలను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి బి.రమేష్, సహాయ కార్యదర్శి కె.సతీష్, సురేష్, శ్రీకాంత్, గోలి మునలయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శిగా చిర్ల



చిర్ల వీర్రాఘవరెడ్డి

అనపర్తి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శిగా అనపర్తి ఉప సర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి ఎంపికయ్యారు. ఈ విషయాన్ని అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బుధవారం తెలిపారు. నియోజకవర్గానికి చెందిన మరో నలుగురికి పార్టీ రాష్ట్ర కమిటీలో చోటు లభించిందన్నారు. రంగంపేట మండలం వడిశలేరుకు చెందిన కొల్లాటి ఇశ్రాయేల్ (పార్టీ రాష్ట్ర కార్యదర్శి), బిక్కవోలు మండలం ఊలపల్లికి చెందిన పార్టీ మండల కన్వీనర్ పోతుల శ్రీనివాసనాగ దుర్గాప్రసాద్ రెడ్డి (పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి)గా, పెదపూడి మండలం సంపరకు చెందిన అద్దంకి ముక్తేశ్వరరావు (పార్టీ రాష్ట్ర కార్యదర్శి)గా, పెదపూడి మండలం పైన గ్రామానికి చెందిన సుందరపల్లి సుధాకర్‌బాబు (పార్టీ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి)గా నియమితులైనట్లు తెలిపారు.

ఆకర్షణీయంగా జగనన్న కాలనీలు



రామేశ్వరం జగనన్న కాలనీలో స్వాగత ముఖద్వారం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పీడీ సుధాకర్ పట్నాయక్

పెదపూడి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని కాకినాడ జిల్లా హౌసింగ్ పీడీ సుధాకర్ పట్నాయక్ అన్నారు. రామేశ్వరంలో జిల్లాలో ప్రథమంగా నిర్మించే జగనన్న కాలనీ స్వాగత ముఖద్వారం (ఆర్చ్) నిర్మాణానికి పీడీ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్చి నిర్మాణాన్ని రూ.4.15 లక్షలతో చేపడుతున్నామని అన్నారు. జగనన్న కాలనీల్లో విద్యుత్తు, రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. పేదల సొంతింటి కల నెరవేరాలని లక్ష్యంతో రాష్ట్రంలో 32 లక్షల మందికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు అందించిందన్నారు. అర్హులంతా ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న గృహ నిర్మాణ రుణ సౌకర్యాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్చిల నిర్మాణంతో జగనన్న కాలనీలకు మరింత శోభ వస్తుందన్నారు. ఈ పనులను సకాలంలో పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామ సర్పంచ్ కొటికలపూడి చినబాబు, హౌసింగ్ ఈఈ గుప్తా, డీఈ కేఎస్ఎన్ రెడ్డి, ఏఈ ఎం.శ్రీనివాసు, ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యారెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ లంక వెంకటేశ్వరరావు, గ్రామ కన్వీనర్ గాజుల మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి



పెదపూడిలో విద్యార్థికి చెవిటి మెషీన్ అమర్చుతున్న ఆర్జేడీ నాగమణి

పెదపూడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మరింత మెరుగుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జోన్-2 విద్యాశాఖ ఆర్జేడీ జి.నాగమణి తెలిపారు. బుధవారం పెదపూడి ఎంపీపీ మెయిన్ పాఠశాలలో జగనన్న విద్యాకానుక నాల్గో విడత మెటీరియల్ భద్రపరిచే మూడు స్ట్రాంగ్ రూమ్‌లను ఆమె పరిశీలించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో కొంత సేపు మాట్లాడారు. వారిలో విద్యా ప్రమాణాలు ఏవిధంగా ఉన్నాయో సబ్జెక్టు వారీగా తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే నలుగురు మూగ, చెవిటి విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన చెవిటి మెషీన్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక అవసరాలు గల పిల్లల సంక్షేమానికి అనేక సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. పేదల జీవితాల్లో విద్యా వెలుగులు నింపాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఈఓ వెంకటేశ్వరరావు, ఏపీఎం చినబాబు, సీఎంఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతే జగన్ ధ్యేయం

- ఎంపీ భరత్‌రామ్
- ఘనంగా ఆసరా సంబరాలు



మహిళలకు ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో మహిళల అభ్యున్నతికి సీఎం జగన్ ఎంతో కృషి చేస్తున్నారని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో బుధవారం వేంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ మూడోవిడత ఆసరా సంబరాలు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కితే నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి సొమ్ములు వెళ్లేలా చర్యలు చేపట్టారన్నారు. కుల, మత, ప్రాంత, పార్టీ రహితంగా పేదరికమే అర్హతగా లబ్ధిదారుల ఎంపిక ఉంటుందన్నారు. పేదలు, మహిళలు ఆర్థికంగా చైతన్యవంతులు కావాలన్నదే జగనన్న ఆశయమన్నారు. మహిళలకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చారని నాలుగు విడతల్లో నెరవేరుస్తున్నారన్నారు. రాష్ట్రంలో 80,000 మంది మహిళలకు రూ.25 వేల కోట్ల రుణమాఫీని నాలుగు దశలలో చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకూ మూడు విడతలు పూర్తయ్యాయన్నారు. 2024 ఎన్నికలలో సీఎం జగనన్నకు సంపూర్ణ మద్దతు ఇచ్చి ఆశీస్సులు అందజేయాలన్నారు. ఈ సందర్భంగా ఆసరా లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేశారు. నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ సత్యవేణి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, గాండ్ల, తెలికుల కార్పొరేషన్ చైర్ పర్సన్ సంకిస భవానీ ప్రియ, పార్టీ నాయకులు పోలు విజయలక్ష్మి, మజ్జి అప్పారావు, పాలిక శ్రీను, పీతా రామకృష్ణ, డాక్టర్ అనసూరి పద్మలత, సప్పా ఆదినారాయణ, మెప్మా మేనేజర్ రవిశంకర్, డివిజన్ ఇన్‌చార్జులు దూర్వాసుల సత్యనారాయణ, వాకచర్ల కృష్ణ, గాదిరెడ్డి పెదబాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అభివృద్ధి పనులపై చర్చ

ప్రధాన ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం చేపట్టబోయే అభివృద్ధి పనులు, రహదారి విస్తరణ తదితర వాటిపై సంబంధిత అధికారులతో ఎంపీ మార్గాని భరత్ రామ్ చర్చించారు. ఆయన బుధవారం ఆయన ఆర్టీసీ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. కాంప్లెక్స్‌లోనూ, ప్రాంగణంలోనూ చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై డీపీటీఓ షర్మిల అశోక, డిపో మేనేజర్ షేక్ షబ్నంను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సిటీ ప్లానర్ సూరజ్ కుమార్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వరహాల బాబు, నగర ప్రణాళిక సూపర్ వైజర్ దీప్తి ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కంబాలచెరువు: స్థానిక జిల్లా, మేజిస్ట్రేట్ కోర్టుల మధ్య గల ప్రాంగణంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రారంభించారు. న్యాయవాదులు, కక్షిదారుల సౌకర్యార్థం దీనిని ఏర్పాటు చేశారు. తొలిరోజు సుమారు వందమంది న్యాయవాదులు, 300 మంది కక్షిదారులకు చెరకురసం, మజ్జిగ పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

సీటీఆర్ఐ: రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని మూల్ నివాసీ సంఘ్ జాతీయ అధ్యక్షుడు నయనాల కృష్ణారావు అన్నారు. పూలే - అంబేడ్కర్ జయంత్యుత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 11 నుంచి 14 వరకు బామ్‌సెఫ్, మూల్ నివాసీ సంఘ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి మహిళలు, యువకులతో యూనిఫారంలో గోదావరి గట్టున గల పూలే విగ్రహం వరకూ రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ చేశారు. బామ్‌సెఫ్ కేంద్ర కమిటీ సభ్యురాలు డాక్టర్ పి.కోమల, బామ్‌సెఫ్ నాయకులు ఎ.ఆదినారాయణ, జి.శ్రీనివాస్, భాస్కరరాజు, రేలంగి శేఖర్, కొంకి రమేష్ పాల్గొన్నారు.